ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

5

గురువారం 9 జనవరి 2025



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఏవీ రంగనాథ్

అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్
- పోచారం మున్సిపాలిటీలో పర్యటన

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో రోడ్లను కబ్జా చేసిన వారిపై చర్యలు తప్పవని, రోడ్లకు అడ్డంగా నిర్మించిన నిర్మాలనును త్వరలో కూల్చివేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. ఆయన బుధవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని కాచవానిసింగారం, దివ్యానగర్, తిరుమల్‌నగర్, మహేశ్వరి, సుప్రభాత్ కాలనీల్లో పర్యటించారు. ఆయా కాలనీల అసోసియేషన్ ఆధ్వర్యంలో రోడ్లు కబ్జా చేశారనే విషయంపై హైడ్రాకు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆయన ఆయా కాలనీల్లో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. అలాగే ఆ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ భూములను, చెరువులు, కాలువలు, కుంటల బఫర్, ఎఫ్‌టీఎల్ ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కాచవానిసింగారం నుంచి దివ్యానగర్‌కు వచ్చే రోడ్డును కబ్జా చేశారని గ్రామస్తులు హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. గేటెడ్ కమ్యూనిటీ కానపుడు కాలనీ చుట్టూ ప్రహరీ ఎందుకు నిర్మించారని దివ్యానగర్ ప్లాట్ ఓనర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నల్ల మల్లారెడ్డిని ప్రశ్నించారు. కాలనీల్లో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టిన తర్వాతే చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో హైడ్రా అధికారులు, కాలనివాసులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనలో కీలక భూమిక పోషించే పన్నుల వసూళ్ల ప్రక్రియ జిల్లాలో మందకొడిగా సాగుతోంది. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పాటు ప్రజల నుంచి ఆస్తి పన్నులు, పన్నేతర రూపంలో వసూలు చేసే ఆదాయాన్ని వినియోగిస్తారు. కాగా, కొంత కాలంగా ప్రభుత్వాల నుంచి పంచాయతీలకు నిధులు రాక సమస్యలతో సతమతమవుతున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.9,82,21,797 వసూలు లక్ష్యం ఉండగా ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ.57,71,338 మాత్రమే వసూలు చేశారు.



ఈ ఏడాది పన్నుల వసూళ్లు

మండలం	శాతం
ధారూరు	30
బంట్వారం	21
మర్పల్లి	11
కులకచర్ల	11
బొంరాస్‌పేట్	8
దోమ	6
బషీరాబాద్	6
తాండూరు	5
మోమిన్‌పేట్	5

లక్ష్యం ఘనం..


వసూళ్లు అధమం

పంచాయతీల్లో పన్నుల రాబడి అంతంతే

- రూ.9.8 కోట్లకుగాను రూ.57 లక్షలు వసూలు
- జిల్లాలో ఇప్పటి వరకు వసూలైంది 6 శాతమే
- ఈ ఏడాది మిగిలింది మూడు నెలల గడువు
- వచ్చే నెలలో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ?
- వేగం పెంచకపోతే మార్చి నెలలోనే వసూళ్లు

వికారాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, చిన్నపాటి మరమ్మతు పనులు చేపట్టేందుకు కూడా పంచాయతీ ఖజానాలో నిధులు అందుబాటులో లేక ఇక్కట్లు తప్పడం లేదు. ప్రజల నుంచి ఆస్తి పన్ను సకాలంలో వసూలు చేయగలిగితే అప్పులు చేయకుండా గ్రామాల్లో కనీస వసతులు కల్పించేందుకు అవకాశం ఉంటుంది గ్రామ పంచాయతీలకు ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్నుల వసూళ్ల అంతమాత్రంగానే కొనసాగుతోంది. రెండు నెలలుగా పన్నుల వసూళ్ల ప్రక్రియ అంతంత మాత్రంగానే ఉంది. అత్యవసర పనులు చేపట్టేందుకు పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేయాల్సి వస్తోంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో మూడు నెలలు మాత్రమే ఉన్నా జిల్లాలో ఇంత వరకు కేవలం 6 శాతం వసూలు చేయగలిగారు. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పంచాయతీలకు ఆస్తి పన్నులతో పాటు భవన నిర్మాణ

మిగతా 8వ పేజీలో...



మిగిలింది 95 రోజులే...

ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభమై తొమ్మిది నెలలు గడిచినా పంచాయతీల్లో ఇంకా పన్నుల వసూళ్ల ప్రక్రియ ఇంకా వేగం పుంజుకోకపోవడం గమనార్హం. గత నాలుగు నెలలుగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది సమగ్ర కుటుంబ సర్వే, సర్వే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో పన్నుల వసూళ్లపై దృష్టి సారించలేకపోతున్నారు. వచ్చే నెలలో పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఫిబ్రవరి నెల మొత్తం ఎన్నికల ప్రక్రియ నిర్వహణకే సరిపోనుంది. ఆ తర్వాత పన్నుల వసూళ్లకు ఒక నెల మాత్రమే సమయం ఉండనుంది. ఇప్పటి నుంచే గ్రామాల్లో పన్నుల వసూళ్లపై దృష్టి సారిస్తేనే నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడమే కాకుండా పంచాయతీలకు ఆదాయం సమకూరనుంది.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

- కలెక్టర్ ప్రతీక్‌జైన్



వికారాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకులాల్లో ప్రవేశాల కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025- 26 విద్యా సంవత్సరంలో వివిధ గురుకులాల్లో ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు ఫిబ్రవరి 23న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వమించనుందని పేర్కొన్నారు. హెచ్‌టీటీపీఎస్://టీజీసీఈటీ.సీజీజీ.జీవోవీ.ఐఎన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి 1వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు .దరఖాస్తుకు కులధ్రువీకరణ పత్రం నంబర్, ఆదాయ ధ్రువీకరణ పత్రం నంబరు, ఆధార్‌కార్డు నంబర్, బర్త్ సర్టిఫికెట్, ఫొటో అవసరమని తెలిపారు. ఎస్సీ ఎస్టీ, బీసీ సాధారణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీ సీట్లలో ప్రవేశాల కోసం, గౌలిదొడ్డి లోని సాంఘిక సంక్షేమ గురుకులంలో 9వ తరగతిలో ప్రవేశాల కోసం, ఖమ్మంలోని గిరిజన సంక్షేమ గురుకులం, పరిగిలో ఎస్‌వోఈలలో 8వ తరగతిలో ప్రవేశాలకు అలుగునూరులోని సీఓఈలో 9 తరగతిలో అడ్మిషన్ల కోసం, రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజ్ గిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకోసం ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌ద్వారా గడువు లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.



అట్టహాసంగా 'బీఎంఆర్ కప్' పోటీలు

ప్రారంభించిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పోటీల్లో పాల్గొన్న 2,100 మంది క్రీడాకారులు

7

బస్సు బంద్.. విద్యార్థుల ధర్నా

పెద్దేముల్ మండలం మంబాపూర్‌లో ఘటన

7



పండుటాకుల పడిగాపులు

ప్రభుత్వం అందించే ఆసరా పింఛన్లు తీసుకునేందుకు పోస్టాఫీసు ఎదుట మండుటెండల్లో పండుటాకులు పడిగాపులు కాశారు. కొడంగల్ మండల పరిధిలోని రావులపల్లి పోస్టాఫీస్ వద్ద బుధవారం రావులపల్లి, దౌల్తాబాద్ మండల పరిధిలోని మాటూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులు పింఛన్ డబ్బులు తీసుకునేందుకు వచ్చారు. నెట్‌వర్క్ స్లోగా ఉండడంతో పింఛన్ పంపిణీలో ఆలస్యం జరిగింది. దీంతో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు మండుటెండలో పడరాని పాట్లుపడ్డారు.

కొడంగల్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి)

టమాట ధర ఢమాల్!

- 20 కిలోల బాక్స్ ధర రూ.100
- పరిగి పరిధిలో 2వేల ఎకరాల్లో సాగు

పరిగి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పరిగి మార్కెట్‌లో టమాట ధర అమాంతం పడిపోయింది. దీంతో టమాట సాగు చేసిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధరలు లేకపోవడంతో తెంచకుండా చేనులోనే వదిలేస్తున్న పరిస్థితి. మార్కెట్‌లో కిలో టమాట రూ. 5 నుంచి రూ.10లు పలుకుతుండగా కూలీల ఖర్చు కూడా రాని పరిస్థితి. మార్కెట్‌లో 20 కిలోల బాక్స్‌కు రూ.90 నుంచి రూ.110లలోపే పలుకుతోంది. ఎకరా టమాట సాగుకు రూ.25 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఇలా అయితే తమ పెట్టుబడి ఎలా అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిగి, పూడూరు, దోమ, కులకచర్ల తదితర మండలాల్లో బోరుబావుల కింద నీటి వసతి కలిగిన రైతులు రబీ పంటగా కూరగాయల సాగు చేపట్టారు. సుమారు 2 వేల ఎకరాల్లో టమాట సాగు చేసినట్లు అంచనా. వాతావరణం అనుకూలించడంతో టమాట దిగుబడి బాగా పెరిగింది. పరిగి పట్టణ కేంద్రంలో నిత్యం జరిగే సంతకు పెద్ద మొత్తంలో టమాటా వస్తుండటంతో ధరలు మరింత పడిపోతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న వారికి కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు.



పరిగి శివారులోని టమాట తోటలో ఇలా

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

- ఎస్పీ నారాయణరెడ్డి



సైబర్ నేరాలపె విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

వికారాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా సైబర్ నేరాలకు గురయ్యారని అనిపిస్తే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930 నంబర్‌కు కాల్ చేయాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం జిల్లాలోని 19 పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ నేరాలపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. డిజిటల్ అరెస్ట్ పేరిట మోసపూరిత బెదిరింపులు, టీఆర్ఏఐ, సీబీఎస్, కస్టమ్స్, నార్కోటిక్స్ అధికారులుగా నటిస్తూ ఫోన్ కాల్స్ వాట్సాప్, టెలీగ్రామ్ సందేశాల ద్వారా అమాయక ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి లక్షల్లో డబ్బు కాజేస్తున్నారన్నారు. ఈ సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు, ప్రజలలో చైతన్యం కలిగించేందుకు పోలీసులు పలు కార్యక్రమాలు నిర్వహించారు.

రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక



రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కమిటీ సభ్యులు

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా పృథ్వీ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి భిక్షం జిల్లా కమిటీని ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షులుగా నవీన్‌రెడ్డి, సంపత్, ఉపాధ్యక్షులుగా సునీల్, దుర్గాభవాని, శెర్వాల్ నాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సైదిరెడ్డి ఫారుక్, కార్యదర్శులుగా చంద్రకళ, కోశాధికారిగా శ్యామ్ సన్వాల్ నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మహేందర్, వినయ్, నరసింహ, రతన్ రాజులు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాములు, ప్రధాన కార్యదర్శి రమేష్, సెక్రటరీ జనరల్ ఫూల్‌సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా కృషి చేస్తూ సంఘం సభ్యులు సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించేలా కృషి చేస్తూ ప్రభుత్వంతో సమన్వయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీజీటీఏ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్, అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికి అడ్డాగా 'మేడ్చల్-మల్కాజిగిరి'

అధికారులు ప్రజలకు విశ్వాసం కల్పించాలి

- జిల్లా అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు
- 'దిశ' కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్
- హాజరైన ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు
- కేంద్ర, రాష్ట్ర పథకాల అమలు, పురోగతిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ ప్రతినిధి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజల ఉపాధికి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అడ్డాగా మారిందని మల్కాజిగిరి ఎంపీ, దిశ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. ఆయన అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ(దిశ) కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు, పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా దిశ చైర్మన్ ఈటల మాట్లాడుతూ అధికారులు చేసే పనుల ద్వారా వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అనే వ్యత్యాసం చూపకుండా ప్రజలకు సత్ఫలితాలు చేకూరేలా చూడాలన్నారు. గతంలో మంత్రుల అధ్యక్షతన డీఆర్‌సీ సమావేశాలు జరిగేవి... ఇప్పుడు కూడా నిర్వహించాలన్నారు. మోదీ పీఎం అయిన పెద్ద

మిగతా 8వ పేజీలో...

జీహెచ్ఎంసీ అధికారులను పిలవాలి



దిశ సమావేశానికి జీహెచ్ఎంసీ కమిషనర్, అధికారులని పిలవాలి. జిల్లా 80 శాతం జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉంది. జీహెచ్ఎంసీ, జిల్లా అధికారులకు సమన్వయం లేకపోవడంతో సమస్యలు పరిష్కారం కావడం లేదు. ప్రభుత్వ భూములు కబ్జాలు అవుతున్నాయి.

-లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే, ఉప్పల్

బస్తీ దవాఖానాల్లో వైద్యులు లేరు



కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో వివిధ కాలనీల్లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాల్లో వైద్యులు ఉండటం లేదు. మందుల కొరత కూడా ఉంది. మందుల పంపిణీ రంగారెడ్డి జిల్లా నుంచి కాకుండా మేడ్చల్ జిల్లాలోనే ఏర్పాటు చేయాలి. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేయాలి.

-వివేక్, ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్

బ్యాంకర్లతో సమావేశాలు నిర్వహించాలి



జిల్లాలో దాదాపు 500కు పైగా వివిధ బ్యాంకులు ఉన్నాయి. రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు ప్రజలను, రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దిశ మాదిరిగానే బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసే రుణాలు ఇప్పించే విధంగా చూడాలి.

-మల్లారెడ్డి, ఎమ్మెల్యే, మేడ్చల్

అసంపూర్తిగా 'మన బడి' పనులు



నిధుల కొరతతో మన ఊరు-మన బడి పనులు మధ్యలో నిలిచిపోయాయి. పలు పాఠశాలల్లో మరుగుదొడ్లు, అదనపు తరగతి గదులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అవసరమైతే ఎమ్మెల్యే, సీఎస్ఆర్ నిధులు ఇచ్చి సహకరిస్తాం. పాఠశాలలు, ఆసుపత్రుల నిర్వహణపై ప్రతీ మూడు నెలలకోసారి తప్పకుండా సమీక్ష నిర్వహించాలి.

-అరికెపూడి గాంధీ, ఎమ్మెల్యే, శేరిలింగంపల్లి

ప్రేమజంట ఆత్మహత్యకు కారణమైన వ్యక్తి రిమాండ్



నిందితుడు మహేశ్‌యాదవ్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమజంటను వేధింపులకు గురిచేసి వారి ఆత్మహత్యకు కారణమైన యువకుడిని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం మధ్యాహ్నం రిమాండ్‌కు తరలించారు. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం.. పోచారం మున్సిపాలిటీ, మక్తా గ్రామానికి చెందిన చింతపంటి నరేందర్ కూతురు లిఖిత(16), యాదాద్రి జిల్లా, బీబీనగర్ మండలం, జమిలపేట్‌కు చెందిన పర్వతం శ్రీరాం(26) ప్రేమజంటను మక్తా గ్రామానికి చెందిన ముంత మల్లయ్య కుమారుడు మహేశ్‌యాదవ్ అలియాస్ చింటూ(22) డబ్బులు కావాలని వేధింపులకు గురిచేశాడు. దీంతో అతడి వేధింపులు తాలలేక ఆ ప్రేమజంట ఈ నెల 6న ఓఆర్ఆర్ సర్వీసురోడ్డు ఘనాపూర్ సమీపంలో ఎర్టిగా కారులో పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకొని ఆత్మహత్య చేసుకున్నారు. బాధితులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని నిందితుడిని మంగళవారం రాత్రి అరెస్టు చేసి బుధవారం మధ్యాహ్నం రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలి



సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు అశోక్, సీపీఎం నాయకులు

తాండూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): దుద్యాల మండలం గౌరారం గ్రామానికి చెందిన బోయిని సాయప్ప మరణాంతరం ఆయన కుటుంబ సభ్యులకు కాకుండా వేరే వారికి నిబంధనలకు విరుద్ధంగా పట్టా మార్పిడి చేసిన అప్పటి తహసీల్దార్ ఆనంద్‌రావుపై చర్య తీసుకోవాలని కోరుతూ తాండూరు అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్‌కు బాధితుడు అశోక్‌తో కలిసి సీపీఎం నాయకులు శ్రీనివాస్, చంద్రయ్య ఫిర్యాదు చేశారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. అశోక్ కుటుంబానికి సంబంధించి సర్వే 57/2అలో 1 ఎకర 13 గుంటల భూమి సాయప్ప పేరు మీదు ఉండగా ఆయన మరణాంతరం విరాసత్‌ను అతని కుమారుడు అయిన అశోక్ పేరు మీద కాకుండా తహసీల్దార్ ఆనంద్‌రావు ఇతరులకు విరాసత్ చేశారని వివరించారు. ప్రస్తుతం ఆనంద్ రావు పరిగి తహసీల్దార్‌గా కొనసాగుతున్నారని ఈయన ఆస్తి మార్పిడి విషయంలో అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎలాంటి పంచానామ చేయకుండానే చేసినట్లు పేర్కొంటున్నారని ఆరోపించారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి అప్పటి విరాసత్‌ను రద్దు చేసి తిరిగి సంబంధిత కుటుంబానికి చేయాలని కోరారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో సాయి సుప్రీత్‌కు బంగారు పతకం



బంగారు పతకం, ప్రశంసాపత్రం అందుకుంటున్న సాయి సుప్రీత్

షాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : బెంగుళూరు శ్రీ దత్తపీఠం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన భగవద్గీత కంఠస్థ పోటీల్లో షాబాద్ ధ్యానహిత పాఠశాలకు చెందిన సాయిసుప్రీత్ బంగారు బహుమతి గెలుచుకున్నాడు. విజయవాడలో శ్రీగణపతి సచ్చిదానందస్వామి చేతుల మీదుగా సాయిసుప్రీత్ బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. కాగా, బంగారు బహుమతి గెలుచుకొని ధ్యానహిత పాఠశాలకు పేరు ప్రఖ్యాతలు తీసుకుచ్చారని పాఠశాల ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్, సాయిసుప్రీత్‌ను, అతడి తల్లిదండ్రులను అభినందించారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు తరలి రావాలి



మహేశ్వరం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకోసం సాగే అంతిమ లక్ష్య సాధనలో భాగంగా నిర్వహించే హైదరాబాద్ సదస్సుకు వేలగొంతులు, లక్ష డప్పుల్లతో చీమల దండులా కదం తొక్కాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగల్ల బాబు మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల బాధ్యులు బక్కని రవి మాదిగ ఆధ్వర్యంలో బుధవారం మహేశ్వరంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు, కార్యకర్తలు డప్పులతో భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు బక్కని రవి, గణేష్, నర్సింహ, మద్దిలేటి మాదిగ ప్రశాంత్, జంగయ్య పాల్గొన్నారు.

తాండూరులో బాల్కీ గ్యాంగ్ హల్‌చల్



కోణాపూర్‌లో చోరీకి యత్నిస్తున్న బాల్కీ గ్యాంగ్.. (పోలీసులు విడుదల చేసిన ఫొటో)

తాండూరు రూరల్, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): తాండూరు మండలంలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన గ్యాంగ్ హల్‌చల్ చేస్తుంది. కర్ణాటక ప్రాంతానికి చెందిన ఈ గ్యాంగ్ తాండూరు నియోజకవర్గంలోని గ్రామా ల్లో వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు వెల్లడించారు. బుధవారం మండల పరిధిలోని కరన్‌కోట్ పోలీసులు ఈ గ్యాంగ్‌కు సంబంధించిన ఫొటోలు, వీడియోలు విడుదల చేశారు. ఈ నెల 1న తాండూరు మండలం కోణాపూర్‌లో నాలుగు ఇళ్లల్లో చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ చోరీల వెనుక కర్ణాటకకు చెందిన బాల్కీ గ్యాంగ్ ఉన్నట్లు నిర్ధారించారు. మొత్తం నలుగురు ఉండే గ్యాంగ్ తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్ చేసుకొని చోరీలకు పాల్పడతారని గుర్తించారు. చోరీ చేయాల్సిన గ్రామానికి సమీపంలో ఏదో ఒక ప్రాంతంలో రాత్రిపూట బసచేసి చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. వచ్చిన పని ముగిశాక అక్కడి నుంచి వెళ్లిపోతారని తెలిపారు. తాండూరు మండలం కోణాపూర్‌లో చోరీలకు పాల్పడినట్లు గుర్తించామని, కోణాపూర్‌తో పాటు తాండూరు మండలం ఖాంజాపూర్, యాలాల మండలం కోకట్ గ్రామ శివారులో సంచరినట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ గ్యాంగ్ గురించి ఏమైనా సమాచారం తెలిస్తే తాండూరు డీఎస్పీ(87126 70017), తాండూరు రూరల్ సీఐ(87126 70051), టౌన్ సీఐ (87126 70049), కరన్‌కోట్ ఎస్‌ఐ (87126 70052), యాలాల ఎస్‌ఐ (87126 70054), పెద్దేముల్ ఎస్‌ఐ (87126 70053), బషీరాబాద్ ఎస్‌ఐ (87126 70055)లను సంప్రదించాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్ రెడ్డి

మేడ్చల్ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ ఏసీపీ వెంకటరెడ్డి కోరారు. బుధవారం మేడ్చల్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. మేడ్చల్ పరిధిలో గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఐదు ప్రమాదాలు ఎక్కువ జరిగాయన్నారు. జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నందున ట్రాఫిక్ సమస్యతో ప్రమాదాలు జరిగాయన్నారు. వాహనాలు నడిపే వారు రాంగ్ రూట్‌లో ప్రయాణించరాదని, హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. ట్రిపుల్‌రైడింగ్, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనం నడపరాదన్నారు. ప్రమాదాల నివారణకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించే జరిమానా, శిక్ష తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ సీఐ హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

బొంరాస్‌పేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సూర్యనాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ బొంరాస్‌పేట్ మండలంలోని గ్రామాలు, తండాల్లోని ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఉపాధ్యాయులు సమయానికి హాజరు కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై పలుమార్లు విద్యాధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న పాఠశాలలపై డీఈవో, ఎంఈవోల పర్యవేక్షణ లేకపోవడంతో ఉపాధ్యాయులు విధులకు ఎగనామం పెడుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో శంకర్‌నాయక్, రాజునాయక్, కేశవులు, అనిల్ ఉన్నారు.

సహకార సంఘాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సహకార సంఘం కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మూడుచింతలపల్లి, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మండలంలోని లక్ష్మాపూర్ పరిధిలో నాబర్డ్ నిధులు రూ. 94.25 లక్షలతో నిర్మించిన రైతు వ్యవసాయ సహకార సంఘం నూతన భవనాన్ని ఎమ్మెల్యే మల్లారెడ్డి డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన భవన నిర్మాణానికి కృషి చేసిన శామీర్‌పేట్ సొసైటీ చైర్మన్ మధుకర్‌రెడ్డితో పాటు పాలకమండలిని అభినందించారు. రైతులు సొసైటీ ద్వారా వచ్చే లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు ఇళ్లు కట్టుకోవాలన్నా, భూమి కొనుగోలు చేయాలన్నా, వారి పిల్లల చదువులకు కూడా సొసైటీ నుంచి సబ్సిడీలో లోన్లు తీసుకోవచ్చన్నారు. అప్పులో ఉన్న సొసైటీని డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, పాలకమండలి కృషితో రూ.60 లక్షల వరకు లాభాల్లోకి తీసుకురావడం గొప్ప విషయమన్నారు. సొసైటీ ద్వారా వచ్చే స్కీముల గురించి రైతలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్తయ్య, ఏఎంసీ చైర్మన్ నర్సింహులు, శామీర్‌పేట్ సొసైటీ వైస్ చైర్మన్ ఐలయ్య, డైరెక్టర్లు భూమిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి, బాపుసింగ్, లక్ష్మీనర్సింహులు, విష్ణు, సుదర్శన్, చంద్రకళ మాజీ సర్పంలు అంజనేయులు, రవి, హరిమోహన్‌రెడ్డి, కృపాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ హరి కమురళీగౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనావాస్‌రెడ్డి, నాయకులు నర్సింహులు, జగ్నాథం, రైతులు పాల్గొన్నారు.

పరిగి అభివృద్ధికి భారీగా నిధులు



పరిగిలో మాట్లాడుతున్న డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎన్.రామకృష్ణ

పరిగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కృషితో పరిగి అభివృద్ధిలో పరుగులు పెడుతోందని డీసీసీ ప్రధాన కార్యదర్శి నాగులపల్లి రామకృష్ణ అన్నారు. బుధవారం సాయంత్రం పరిగిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో జిల్లాలోనే పరిగి అభివృద్ధికి ఎక్కువ నిధులు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యేకే దక్కిందన్నారు. పరిగి కేంద్రం నుంచి రహదారుల సంబంధాలపై దృషి పెట్టారని చెప్పారు. పరిగి-షాద్‌నగర్, పరిగి-వికారాబాద్‌ల వరకు నాలుగు లేన్‌ల రోడ్ల నిర్మాణాల కోసం సీఎంను ఒప్పించి రూ.340 కోట్లు మంజూరు చేయించారన్నారు. ఆరు గ్యారంటీలు విజయవంతంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. పరిగి అస్పత్రికి రూ.26 కోట్లు పట్టణ అభివృద్ధికి రూ.25 కోట్లు, తాగునీటి వసతికోసం రూ.16 కోట్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. గడిసింగాపూర్ నుంచి రంగారెడ్డిపల్లి వరకు రూ.100 కోట్లతో రోడ్డు విస్తరణ పనులకు టెండర్ పిలిచినట్లు చెప్పారు. 24గంటలు పరిగి అభివృద్ధినితపించే రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నసీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా బీఎంఆర్ కప్ పోటీలు

- ప్రారంభించిన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి
- పోటీలకు హాజరైన 2,100 మంది క్రీడాకారులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు/యాలాల, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఎంతో దోహదపడతాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన యాలాల మండల పరిధిలోని గౌతమి మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన తాండూరు నియోజకవర్గ స్థాయి ఎమ్మెల్యే, బీఎంఆర్ కప్పు క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ క్రీడా పోటీలకు తాండూరు నియోజకవర్గానికి చెందిన మొత్తం 50జిల్లా పరిషత్ పాఠశాలలకు చెందిన 2100 విద్యార్థులు పాల్గొన్నారు. మొదట క్రీడాజ్యోతి వెలిగించి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పోటీలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడా పోటీల్లో రాణించాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నారన్నారు. గత పాలకులు తాండూరు నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని, కనీసం నియోజకవర్గ స్థాయిలో పోటీలు పెట్టలేదని ఆరోపించారు. సంవత్సరంలోగా తాండూరులో స్టేడియం ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. నాలుగు రోజులపాటు కొనసాగే పోటీల్లో ప్రతి ఒక్కరూ ఆసక్తిగా పాల్గొని విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కప్ ఆర్గనైజర్ సుధాకర్ రెడ్డి, గౌతమి పాఠశాల కరస్పాండెంట్ షైపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ పరిమళ, ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, యాలాల పీఏసీఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కొండల్‌రెడ్డి, నాయకులు సంగెం హన్మంతు, రవి.మురళి, ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

ఏడాదిలోగా మినీ స్టేడియం పనులు పూర్తి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాజకీయాలకతీతంగా కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల అభివృద్ధికి సహకారం అందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గులో మినీ స్టేడియం నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరయ్యాయని ఆయన తెలిపారు. బుధవారం కొందుర్గు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేపీఎల్ ప్రీమియర్ లీగ్ సీజన్-5 క్రికెట్ పోటీలను తెలంగాణ ఒలంపిక్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ విజయ్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మినీ స్టేడియం నిర్మాణ పనుల కోసం నిధులు మంజూరయ్యాయని అన్నారు. పరిగి-షాద్‌నగర్ ఫోర్‌లేన్ రోడ్డు పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, శ్రీశైలం, శ్రీధర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, వివిధ పార్టీల నాయకులు బోయ శంకర్, కేకే, రాములుగౌడ్, నరేందర్, రఘునాథ్‌గౌడ్, చంద్రశేఖర్, మల్లేష్ గౌడ్, యాదయ్య, రామకృష్ణ, వాసురీ, అర్జున్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

తలకొండపల్లి: మండల కేంద్రంలో తలకొండపల్లి ప్రీమియర్ లీగ్ సీజన్-3 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పోటీలను ప్రారంభించారు. నారాయణ రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ గీతా నర్సింహ, పీసీసీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకుడు కాసు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా, మండల నాయకులు అంజయ్య, రవీందర్ యాదవ్, అజీమ్, గుజ్జల మహేశ్, భగవాన్ రెడ్డి, డిగ్రీ కృష్ణ, నరేశ్, డేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

చేవెళ్ల: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని షాబాద్ సీఐ కాంతారెడ్డి, చేవెళ్ల ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించగా సీఐ ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులున్నారు.

ఫోర్త్‌సిటీ రోడ్డు భూసేకరణపై బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల వాగ్వాదం

- రైతులతో అధికారుల మీటింగ్
- నాయకుల జోక్యంతో సమావేశం వాయిదా



నేతలతో మాట్లాడుతున్న అధికారి రాజు

కందుకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫోర్త్‌సిటీ వరకు వేసే రోడ్డు కోసం భూసేకరణపై డివిజన్ స్థాయిలో ఏర్పాటు చేసిన సమావేశంలో గందరగోళం చోటుచేసుకుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డి నిశ్చయించారు. ఈమేరకు మహేశ్వరం నుంచి ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి వరకు చేపట్టనున్న 330 ఫీట్ల రోడ్డు వేసే క్రమంలో భూములు కోల్పోతున్న రైతులతో బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. దీనికి మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు కూడా వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య కొంతసేపు వాగ్వాదం, తోపులాట జరిగింది. భూములు కోల్పోతున్న రైతులకు ఆర్డీవో కార్యాలయం నుంచి ముందస్తు సమాచారం ఇవ్వడం లేదని బీఆర్ఎస్ నాయకులు తెలిపడంతో.. ఆర్డీవో మరోసారి రైతులతో సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఇరువర్గాల నాయకులు శాంతించి వెనుదిరిగారు.

మహానగరంగా మహేశ్వరం : కేఎల్లార్

రాబోయే రెండేళ్లలో మహేశ్వరం నియోజకవర్గానికి మహర్దశ పట్టనుందని, మహానగరంగా మారేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఆర్డీవో ఆఫీసులో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని, రావిరాల ఓఆర్ఆర్ ఎగ్జిట్ 13 నుంచి కందుకూరు మండలం బేగరికంచ వరకు 450 ఎకరాల భూమిని సేకరించి 330 ఫీట్ల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దాంతో వందేళ్ల వరకు ట్రాఫిక్ సమస్య ఉండదని, ఈ విషయంలో ప్రతిపక్షాల మాయమాటలు నమ్మవద్దన్నారు. 2013 జీవో ప్రకారం భూములు కోల్పోతున్న రైతులకు 2013 ప్రకారం మార్కెట్ రేటు ప్రకారం మూడు రెట్లు పరిహారం ఇవ్వనున్నట్లు తెలిపారు. దీంతోపాటు మరో 25శాతం ఎక్కువ పరిహారం ఇవ్వడానికి సీఎం కృతనిశ్చయంతో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాజు, తహసీల్దార్ గోపాల్, సీఐ సీతారాం, ఎస్సై సైదులు, పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ జంగారెడ్డి, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనర్సింహరెడ్డి, డిల్లీ గణేష్, డిల్లీ శ్రీధర్, ఈర్లపల్లి శ్రీకాంత్, ఇ.భూపాల్‌రెడ్డి, జంగారెడ్డి, రాణాప్రతాప్‌రెడ్డి, నర్సింహచారి పాల్గొన్నారు.

30 కేజీల గంజాయి పట్టివేత



నిందితుడితో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

తాండూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బస్తాల్లో నింపి గుట్టుచప్పుడు కాకుండా రైల్లో గంజాయిని తరలిస్తున్న వ్యక్తి ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడ్డాడు. తాండూరు రైల్వే స్టేషన్‌లో అతని నుంచి 30 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.7.50 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. తాండూరు మీదుగా హైదరాబాద్ వెళ్లే కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తాండూరు రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఓ సమయంలో ఒడిశాకు చెందిన శిబిరామ్ స్వాన్ అనే వ్యక్తి అనుమానస్పాదంగా కనిపించడంతో బ్యాగులను సోదా చేశారు. బ్యాగులో 12 కిలోల ఎండు గంజాయిని గుర్తించారు. అతన్ని విచారించి మరో బ్యాగులో 18 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. తాండూరులో ఓ వ్యక్తికి గంజాయిని అందించేందుకు వచ్చి పట్టుబడ్డారని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. 30 కిలోల గంజాయి విలువ రూ. 7.50లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. ఎక్సైజ్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి , ప్రేమ్ కుమార్ రెడ్డిల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ బీబీ కమలహాసన్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయ భాస్కర్ సిబ్బందిని అభినందించారు.

వాహనాదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

చేవెళ్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వాహనాదారులు ట్రాఫిక్‌రూల్స్ తప్పనిసరిగా పాటించాలని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ తెలిపారు. రోడ్డు భద్రతపై బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలో ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించి డ్రైవ్ చేయాలని, రోడ్లపై వాహనాలను పార్క్ చేయవద్దన్నారు. మార్నింగ్‌వాక్‌కు వెళ్లేవారు వీలైనంత వరకు జాతీయ రహదారులు ఉపయోగించరాదన్నారు. చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం, ఏఎస్సైలు అశోక్, చందర్‌నాయక్, పాఠశాలల ప్రిన్సిపాల్లు, ట్రాఫిక్ పోలీస్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలరించిన ఒగ్గు విన్యాసాలు

- ముగిసిన ఒగ్గుడోలు శిక్షణ శిబిరం
- హాజరైన ఎమ్మెల్యే



యాలాల, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): ఒగ్గు అంటే శివుని చేతిలో ఢమరుకమని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర భాషా సంస్కృతిక శాఖ, మల్లికార్జున ఒగ్గు కళా సేవా సమితి ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎన్కెపల్లిలో 21 రోజల పాటు ఒగ్గుడోలు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. బుధవారం ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారులు తమ విన్యాసాలతో ఆకట్టుకున్నారు. డోలు వాయిస్తూ కళాకారాలు వేసిన విన్యాసాలు అలరించాయి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం హైదరాబాద్ రోడ్డు మార్గం పక్కన ఎకరం స్థలం కురుమ సంఘానికి ఇస్తామన్నారు. ఆ స్థలంలో కురుమ సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఒగ్గుడోలు శిక్షణ పొందిన కళాకారులకు రాష్ట్ర స్థాయిలో ప్రదర్శించే అవకాశం కల్పించేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

బస్సు బంద్.. విద్యార్థుల ధర్నా

- గంటపాటు ట్రాఫిక్‌జామ్



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

పెద్దేముల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జనగాం గ్రామానికి చెందిన విద్యార్థులు, వారి తల్లితండ్రులు బుధవారం మంబాపూర్ గ్రామంలో ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించారు. పోలీసుల హామీతో విరమించారు. పెద్దేముల్ మండలం జనగాం గ్రామానికి సమయానుకూలంగా రోజూ ఉదయం, సాయంత్రం ఆర్టీసీ బస్సు సర్వీస్ నడుస్తుంది. గ్రామ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా అక్కడ బురదగా మారింది. వారం క్రితం ఆ బురదలో బస్సు దిగబడింది. దీంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసు నిలిపివేశారు. దీంతో విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆర్టీసీ డీఎంతో గ్రామస్థులు మాట్లాడితే మీరెవరు బస్సు దిగబడినపుడు సహకరించలేదని, అందుకోసం తాము బస్సు సర్వీసును నిలిపివేశామని చెప్పినట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. పైప్‌లైన్ లీకేజీతో బురదగా మారిన చోట మరమ్మతులు చేశామని, ఇపుడు ఎలాంటి ఇబ్బందులు లేవని చెప్పినా అధికారులు బస్సు వేయడం లేదని వాపోయారు. బస్సు సర్వీలు లేక మంబాపూర్ వరకు నడుచుకుంటూ వెళ్లి అక్కడి నుండి బస్సులు వెలుతుంటే పాఠశాల, కళాశాల సమయం దాటిపోతోందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులకు మొరపెట్టుకున్నా వారం రోజుల నుండి బస్సు వేయడం లేదని, అందువల్ల తాము ధర్నాకు దిగామని విద్యార్థులు పేర్కొన్నారు. తాండూరు-హైదరాబాద్ రోడ్డుపై విద్యార్థులు వారితల్లితండ్రులతో కలిసి రాస్తారోకో చేయడంతో ఆరోడ్డులో సుమారు గంటపాలు రవాణా వ్యవస్థ స్థంభించిపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు మంబాపూర్ గ్రామానికి చేరుకుని విద్యార్థులు వారితల్లితండ్రులతో మాట్లాడారు. తాము ఆర్టీసీ డీఎంతో మాట్లాడి గ్రామానికి బస్సువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



డైరీ ఆవిష్కరిస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీజీరెడ్డి

కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఘట్‌కేసర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఏ గ్రేడ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సీజీ రెడ్డి అన్నారు. బుధవారం మంగళవారం రాత్రి పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలోని ఎస్‌బీఆర్ గార్డెన్‌లో జరిగిన ఏ గ్రేడ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు మహేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంట్రాక్టర్లలందరూ ప్రభుత్వం తీసుకున్న వెండర్ విధానానికి కట్టుబడి ఉండాలని సూచించారు. ప్రతి కాంట్రాక్టర్ రాష్ట్రంలోగాని జిల్లాలో గాని సభ్యత్వం పొంది ఉండాలన్నారు. ప్రధానంగా వెండ్ విధానంలో ఉన్న లోటుపాట్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులోని లోపాలను సవరించాలని అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా వారు దృష్టి సారించడం లేదన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో రాష్ట్రప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు మాజీ సభ్యుడు నక్క యాదగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, కోశాధికారి కనకాచారి, ఉపాధ్యక్షుడు ప్రదీప్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ నరేందర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నామిని వెంకటేశ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నాగయ్య, పుల్లారావు, సత్యానారాయణ, మహేశ్‌రెడ్డి, ఆయా జిల్లాల కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

కీసర, జనవరి 8, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకురావాలని యాద్గార్‌పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పకళ అన్నారు. బుధవారం మండల పరిధిలోని యాద్గార్‌పల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో ఎంపీటీసీ నిధులు, అమ్మ ఆదర్శ నిధుల సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లను ప్రారంభించారు. ఆదర్శ పాఠశాల చైర్మన్ ప్రేమలత, చీర యాదగిరి పాల్గొన్నారు

వైకుంఠ ఏకాదశిని జయప్రదం చేయాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని మండలంలోని వైష్ణవ దేవాలయాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఎదులాబాద్‌లోని గోదా సమేత శ్రీమన్నారు రంగనాయకస్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉత్తరద్వార దర్శనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు టీపీ అనంతసేనామాచార్యులు, పురుషోత్తమాచార్యులు, రాజగోపాల చార్యులు బుధవారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కులకచర్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీజేపీ నాయకులు కులకచర్ల తహసీల్దార్ మురళీధర్‌ను బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడ మహేశ్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటయ్యగౌడ్, జానకిరామ్, చంద్రలింగం, సురేందర్‌గౌడ్, వెంకట్, మోనాచారి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

దోమ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దోమ మండలంలోని దిర్సంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడాకారుకు ఐదు రోజులపాటు శిక్షణ నిర్వహించారు. శిక్షణ ముగింపు కార్యక్రమంలో బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య క్రీడాకారులను అభినందించారు. వరంగల్‌లో నిర్వహించే ఖోఖో పోటీల్లో జిల్లాకు పతకాలు సాధించాలని సూచించారు. శిబిరానికి అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ శకుంతల చెన్నారెడ్డి, వెంకట్రాములు, చెన్నారెడ్డి, బందెయ్య, ఉపాధ్యాయులు రూప్‌సింగ్, శివకుమార్, రాజు, రాము, పీఈటీ గోపాల్ పాల్గొన్నారు.

మేడ్చల్ పెద్ద చెరువుకు కాలుష్య ముప్పు



మేడ్చల్ పెద్ద చెరువులో కలుస్తున్న మురికి నీరు

మేడ్చల్ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని పెద్ద చెరువకు కాలుష్య ముప్పు పొంచి ఉంది. పలు కాలనీల నుంచి మురికి కాల్వలను చెరువులోకి మళ్లించడంతో చెరువు నీరు కలుషితమై దుర్గంధాన్ని వెదజల్లుతోంది. బ్యాంకు కాలనీ, బృందావన్ కాలనీ, హరిజన వాడ, టీచర్స్ కాలనీలకు చెందిన డ్రైనేజీ లైన్‌ల మురికి నీటిని మేడ్చల్ పెద్ద చెరువలోకి వదులుతున్నారు. గతంలో స్థానికులు పెద్ద చెరువును కలుషితం కాకుండా చూడాలంటూ మున్సిపల్ అధికారులను కోరగా కొన్ని కాలనీల నుంచి వచ్చే డ్రైనేజీలను చెరువులో కలవకుండా తాత్కాలిక చర్యలు చేపట్టారు. వార్షా కాలం నుంచి తిరిగి కాలనీల మురికి నీరు చెరువులో కలుస్తోంది. అధికారులు చెరువు వపరిసరాల్లోని కాలనీల నుంచి వస్తున్న మురికి నీరు చెరువులో కలువకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి



బొంరాస్‌పేట్: బొట్లవనితండా ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో వెంకన్నగౌడ్

బొంరాస్‌పేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో వెంకన్నగౌడ్ సూచించారు. బుధవారం బొట్లవనితండా గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో బియ్యం, వంట సామగ్రి తదితర వాటిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం నాణ్యతలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సిబ్బందికి సూచించారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

పరిగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పరిగి ఎంఈవో గోపాల్ సూచించారు. బుధవారం పరిగిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అపార్ ఐడీని జనరేట్ చేయాలన్నారు.

మోమిన్‌పేట్‌లో..

మోమిన్‌పేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈవో మల్లేశంతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, వంట సామగ్రిని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని లేని పక్షంలో చర్యలు తప్పవన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

బషీరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతతో వండి పెట్టాలని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేశ్ ఏజెన్సీ మహిళలకు సూచించారు. బుధవారం మండలంలోని మంతట్టి, కాశీంపూర్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజన ఏజెన్సీ మహిళలతో బియ్యం ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు.

రాంపల్లిలో బీజేపీ ఆందోళన



రాంపల్లి చౌరస్తాలో ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

కీసర రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య దాడికి నిరసనగా బుధవారం నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి చౌరస్తాలో బీజేజీ నాయకులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని మండిపడ్డారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, బుద్దవరం లక్ష్మి, నాయకులు సురేశ్, కిషోర్, నరేశ్, సూర్యశేఖర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, జంగారెడ్డి, పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబురాలు

పరిగి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పరిగి శ్రీసరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబురాలు జరుపుకున్నారు. ముగ్గులు, పతంగి పోటీలు, ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల సమితి కార్యదర్శి భీంసేన్‌రావు, పట్టణ బీజేపి కార్యదర్శి అంజనేయులు మాట్లాడుతూ, సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. హెచ్‌ఎం మల్లేశ్, పట్టణ బిజేపి ప్రధానకార్యదర్శి వార్ల అంజనేయులు, విజయ్‌కుమార్,శ్రీనివాస్‌రెడ్డి, బాలకిష్టారెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను అంతం చేయాలి

దోమ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ, సమైక్యతకు రాజకీయ పార్టీలన్నీ ఏకమై ఉగ్రవాద మూలాల అంతానికి కృషి చేయాలని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం నాయకుడు, మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు రాజీరెడ్డి అన్నారు. బుధవారం దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రార్థన సమయంలో వికారాబాద్ జిల్లా వీర జవాన్‌ల సంఘం నాయకులు గురునాథ్ రెడ్డి, లింగమయ్యల ఆధ్వర్యంలో చత్తీస్‌గడ్, బీజాపూర్ జిల్లాలో ఉగ్రవాదుల దాడిలో అమరులైన ఎనిమిది మంది వీర జవాన్లకు నివాళులు అర్పించారు. కర్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బంగ్లా యాదయ్యగౌడ్ పాల్గొన్నారు.

పేదలకు అండ సీఎంఆర్‌ఎఫ్

మోమిన్‌పేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సుభాష్‌గౌడ్, ఏరాజ్‌పాషా, సోమారపు రవి, శ్రీశైలం, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

కోట్‌పల్లి పీహెచ్‌సీ తనిఖీ

కోట్‌పల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపం ఉన్నవారికి తగిన మందులు ఇవ్వాలని ఎంసీఎచ్ ప్రాజెక్టు జిల్లా అధికారి పవిత్ర కోరారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. తాండూర్ దవాఖాన, వికారాబాద్‌లలో ఫిబ్రవరిలో కు.ని ఆపరేషన్ క్యాంపులు ఉంటాయని తెలిపారు. డాక్టర్ బీబీజాని, కోట్‌పల్లి డాక్టర్ మేఘన, ఫార్మా సిస్టర్ రాజేశ్వర్ రెడ్డి ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మేడ్చల్ టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైవే విస్తరణ పనుల్లో భాగంగా గురువారం మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కేఎల్‌ఆర్ వెంచర్, ఎన్‌హెచ్ మెయిన్ రోడ్డు, వినాయక్ నగర్, టీచర్స్ కాలనీ, స్టేషన్ రోడ్డు కంట్రీ క్లబ్, సరస్వతి నగర్, బాలాజీ నగర్, జ్యోతి నగర్, ఎన్‌జీఓ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని తెలిపారు.

మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదుద్దాతాం

కులకచర్ల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కులకచర్ల మార్కెట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులు అన్నారు. బుధవారం మార్కెట్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.93 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.40 లక్షలతో షాపింగ్ కాంప్లెక్స్, రూ.40 లక్షలతో కార్యాలయం, రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.3 లక్షలతో మరుగుదొడ్లను నిర్మించనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న చైర్మన్ ఆంజనేయులు

సహకార సంఘం అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి

దోమ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దోమ మండల మోత్కుర్ వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌పై అవిశ్వాసం నెగ్గి ఈ నెల 2న నూతన చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన యాదవరెడ్డి మొదటి సారి బుధవారం పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. రుణమాఫీ, దీర్ఘకాలిక, స్వల్ప కాలిక రుణాలు తదితర విషయాలపై సీఈవో యాదగిరిని అడిగి తెలుసుకున్నారు. సీఈవో యాదగిరి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకొని గాలిపటాలు ఎగురవేసేందుకు చైనా మాంజాను వినియోగించినా, విక్రయించినా చర్యలు తప్పవని ఘట్‌కేసర్ సీఐ పందిరి పరశురాం హెచ్చరించారు. చైనా మాంజా తెగి వాహనదారులకు, పక్షులకు చుట్టుకొని ప్రాణాలు పోతున్నాయని తెలిపారు. ఎవరైనా వాడినట్లు తెలిస్తే 100 నంబర్‌కు, పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు.

ప్రజల పక్షాన పోరాడాలి

తాండూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తప్పు చేసిన అధికారులకు వంతపాడిన వారు ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని కౌన్సిలర్ సంగీత ఠాకూర్ బుధవారం ప్రకటన ప్రకటనలో సూచించారు. ఐదు నెలల క్రితం ఫిర్యాదు చేస్తే ఆ ఫిర్యాదును అడగడానికి వెళ్లిన నాయకుడిపై అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. డ్రైనేజీల్లో పూడిక పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలపై అడుగుతున్న వారిపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆరోపించారు.

సంక్షిప్తంగా..

కులకచర్ల: మండలంలోని కామునిపల్లి అంగన్‌వాడీ ప్రీ స్కూల్ విద్యార్థులకు బుధవారం ఏకరూప దుస్తులు పంపిణీ చేసినట్లు అంగన్‌వాడీ టీచర్ పండరిబాయి తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రయ్య, ఉపాధ్యాయులు రజిత, లలిత, చైర్‌పర్సన్ కిష్టమ్మ పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని బండవెల్కిచర్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బిలకంటి పద్మమ్మ కుటుంబ సభ్యులను పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరామర్శించారు. బుధవారం గ్రామానికి వెళ్లి పద్మమ్మ భర్త సాయిరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ కులకచర్ల, చౌడాపూర్ మండలాల అధ్యక్షులు శేరి రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిగి: మండల పరిధిలోని రంగంపల్లి యూపీఎస్ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.ప్రతిభ సొంత డబ్బులతో విద్యార్థులకు రాగిజావ తాగేందుకు స్టీల్ గ్లాసులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుద్యాల: విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు గణిత మేళా దోహదపడుతుందని గణిత ఉపాధ్యాయుడు రవీందర్‌గౌడ్ అన్నారు. దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత మేళాలలో హకీంపేట్, కుదురుమళ్ల, పోలెపల్లి, గౌరారం, చిలుముల్‌మైలారం, లగచర్ల, సాగారంతండా తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంఈవో విజయరామారావు, ఎస్సైలు రవూఫ్, మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: కొడంగల్ పట్టణంలోని వీబీఆర్ కంప్యూటర్ శిక్షణ కేంద్రంలో బుధవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిక్షణ కేంద్రం నిర్వాహకుడు భీమరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో యువకులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు.

నవాబుపేట: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బుధవారం నవాబుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ గేమ్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. ఎంఈవో అబ్దుల్ రహెమాన్, పోలీసు సిబ్బంది శ్వేత, మురళి పాల్గొన్నారు.

మర్పల్లి: మండలంలోని గుండ్ల మర్పల్లి గ్రామంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేశ్, రాష్ట్ర సీనియర్ నాయకులు గూడెం రాములు యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు సాయన్న, సలీమొద్దీన్, సురేశ్, మహేశ్, సంజీవరెడ్డి, సాయిబాబా, సురేశ్, పాండు, శ్రీశైలం, కుమ్మరి సిద్దన్న, ఈశ్వర్, వీరయాదవ్, మహబూబ్ అలీ, శ్రీనివాస్, మల్లేశం, గొల్ల రవీందర్, సలీమోద్దీన్, జంగం ఆంజనేయులు, నర్సింహులు, బోయిని విఠల్ పాల్గొన్నారు.

బషీరాబాద్: అసంపూర్తిగా ఉన్న శ్మశానవాటిక నిర్మాణ పనులను బషీరాబాద్ పంచాయతీరాజ్ ఏఈ యశ్వంత్ బుధవారం పరిశీలించారు. రెండేళ్ల కిందట సకాలంలో నిధులు రాలేవని కాంట్రాక్టర్ మధ్యలో పనులు నిలిపివేశాడు. ప్రస్తుతం ఆ పనులను పరిశీలించారు. ఆయనవెంట మాజీ వార్డు సభ్యుడు సిద్దార్థ ఉన్నారు.

క్రైం కార్నర్

స్కూటీని ఢీకొట్టిన లారీ.. మహిళ మృతి

వికారాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్కూటీని లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళా మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్‌పల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శివమ్మ(70) ఆమె కుమారుడు రవిబుధవారం వికారాబాద్ కోర్టుకు పనినిమిత్తం వచ్చారు. పని ముగించుకొని గ్రామానికి స్కూటీపై వెళ్తుండగా వికారాబాద్‌జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట మలుపు వద్ద వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివమ్మ, రవి కింద పడిపోగా వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా తీవ్రంగా గాయపడ్డ శివమ్మ మృతి చెందింది. రవి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమ్‌కుమార్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో గృహోపకరణలు దగ్ధం



కీసర, జనవరి8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం అయిన ఘటన బుధవారం కీసరలో జరిగింది. కీసర గ్రామంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా ఉన్న కాలనీలోని పదుల సంఖ్యలో ఇళ్లలో విద్యుత్ హెచ్చుతగులు రావడంతో టీవీలు, ఫ్రిజ్‌లు, ఇతర ఎలక్ట్రికల్ వస్తువులు, సోఫాలు, డైనింగ్ టేబుల్ ఇతర గృహోపగకణలు దగ్ధం అయ్యాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండటంతో పెను ప్రమాదం తప్పిందని కాలనీవాసులు పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు గుర్తించి విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు అధికారులను కోరారు.

గుర్తు తెలియని యాచకుడి మృతి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని యాచకుడు మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ పరశురాం తెలిపిన వివరాల ప్రకారం. అవుషాపూర్‌లోని బావర్చి హోటల్ సమీపంలో గుర్తుతెలియని యాచకుడు (55) మృతిచెందాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘనా స్థలానికి చేరుకొని పరిసరాలను పరిశీలించగా ఎలాంటి ఆధారాలు లభించలేదు. అవుషాపూర్‌లో ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేసినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చౌడాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆటో, బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి పరిస్థితి విషమించి మృతి చెందాడు. మంగళవారం చౌడాపూర్ నుంచి నవాబుపేటకు ప్రయాణికులతో వెళ్తున్న ఆటో మక్త వెంకటాపూర్ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న దస్తగిరి(33)కి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు రజాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కులకచర్ల ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపారు.

లక్ష్యం ఘనం.. వసూళ్లు అధమం

-5వ పేజీ తరువాయి


అనుమతులు, లైసెన్సులు, తైబజార్, బంజరు దొడ్ల నిర్వహణ తదితర విభాగాల ద్వారా ఆదాయం సమకూరుతుంది. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి పంచాయతీలు ఆస్తి పన్నుల వసూళ్లలో నిర్దేశించిన లక్ష్యం అధిగమించాల్సి ఉంటుంది. డిమాండ్ మేరకు ఆస్తి పన్నులు ఎంత వసూలు చే యాలనేది అధికారులు నిర్ణయిస్తారు. లైసెన్సులు, భవన నిర్మాణ అనుమతులు, తైబజార్, బంజరు దొడ్ల నిర్వహణపై సమకూరే ఆదాయాన్ని అంచనా వేసి ఆ మేర ఆదాయం సమకూర్చుకునేందుకు పంచాయతీల నిర్వాహకులు చర్యలు తీసుకోనున్నారు. ప్రజల నుంచి వసూలు చేసే పన్నులను ప్రభుత్వ ఖజానాలో జమ చేసి పంచాయతీ అవసరాలు, సదుపాయాల కల్పన, అత్యవసర పనులకు ఖర్చు చేసేందుకు ఆ నిధులను వెచ్చిస్తారు. పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల వేతనాలు, గ్రామ సభలు, ప్రభుత్వ కార్యక్రమాల నిర్వహణ తదితర పనులకు ప్రభుత్వ ఖజానా నుంచే ఖర్చు చేయనున్నారు.

నాలుగు మండలాల్లో ఒక్కశాతమే

జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పన్నుల రూపంలో రూ. 9,82,21,797 వసూలు చేయాలన్న లక్ష్యం ఉంది. ఈ పన్నుల్లో గత బకాయిలు రూ.65,94,378 ఉన్నాయి. ఇందులో ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మొత్తం రూ.57,71,338 మాత్రమే వసూలు చేశారు. ప్రజల నుంచి వసూలు చేసిన ఈ పన్నుల సొమ్ము రూ. 56,29,611 ఉండగా, గత బకాయిలు రూ.1,41,727 ఉన్నాయి. ధారూరు మండలంలో 30 శాతం మేర పన్నులు వసూలు చేయగా, బంట్వారంలో 21 శాతం, మర్పల్లి, కులకచర్ల మండలాల్లో 11 శాతం మేర పన్నులు వసూలు చేశారు. బొంరాస్‌పేట్‌లో 8 శాతం, దోమ, బషీరాబాద్‌ల్లో 6 శాతం, తాండూరు, మోమిన్‌పేట్‌ల్లో 5 శాతం, పరిగిలో 4 శాతం, యాలాల్, వికారాబాద్, పూడూరులో 3 శాతం, నవాబ్‌పేట్‌లో 2 శాతం, పెద్దేముల్, కోట్‌పల్లి, కొడంగల్, దౌల్తాబాద్ మండలాల్లో ఒక్కో శాతం వంతున మాత్రమే పన్నులు వసూలు చేయగలిగారు.

ఉపాధికి అడ్డాగా 'మేడ్చల్-మల్కాజిగిరి'

-5వ పేజీ తరువాయి



మొత్తంలో రోడ్లు నిర్మించామన్నారు. రైల్వేలో గణనీయమైన అభివృద్ధి జరిగిందన్నారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో రూ.2 వేల కోట్లతో అభివృద్ధి జరుగుతోందన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు కేంద్రం నుంచి నిధులు తీసుకురావడానికి తనవంతుగా ప్రయత్నం చేస్తానన్నారు. ఈ సమావేశంలో మెంబరు సెక్రటరీ, కలెక్టర్ గౌతమ్‌తో పాటు కమిటీ సభ్యులు, అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రశాంత్, డీఈఓ విజయకుమారి ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మల్కాజిగిరి నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి అధికారులను బతిమిలాడుడు, కాళ్లు మొక్కుడు ఒక్కటే మిగిలింది. ప్రైవేటు కాలేజీల్లో చిన్న సమస్య వచ్చినా యంత్రాంగం యుద్ధానికి దిగుతుంది. అంగన్‌వాడీ, పీహెచ్‌సీ సెంటర్లలో పాములు తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.

- మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే, మల్కాజిగిరి

యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

వికారాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): 8వ జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని వికారాబాద్, తాండూరులోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు 7, 8 తేదీల్లో యజ్ఞ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. స్వామి వివేకానందుడి జీవితం, తత్వం, ఆయన కృషిని గుర్తు చేసుకోవడంతోపాటు యువతలో ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత దేశాభివృద్ధిపట్ల అవగాహన కల్పించడానికి ఈ పోటీలు నిర్వహించినట్లు ఫౌండేషన్ నిర్వాహకుడు ఉజ్వల్‌కుమార్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం బహుమతులు ప్రదానం చేశారు.